ఓటర్ స్లిప్పులపై.. క్యూఆర్‌కోడ్


సత్తుపల్లిలో ఓటర్ స్లిప్, ఓటర్‌గైడ్, కరపత్రాలు పంపిణీ చేస్తున్న బీఎల్‌ఓలు

- ఇంటింటికీ స్లిప్పులతో పాటు ఓటర్ గైడ్
- పంపిణీలో నిమగ్నమైన బీఎల్‌ఓలు

సత్తుపల్లిటౌన్: ఈ నెల 30న జరిగే శాసనసభ ఎన్నికల్లో పాల్గొనే ఓటర్లకు సాంకేతిక హంగులతో ఓటరు స్లిప్పులు అందించేందుకు ఎన్నికల సంఘం చర్యలు చేపట్టింది. ఈ ఎన్నికల్లో గత ఎన్నికల మాదిరిగా ఓటర్ స్లిప్పులపై ఫొటోలు ముంద్రించకుండా క్యూఆర్‌కోడ్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఓటరు ఫొటోలను క్యూఆర్‌కోడ్‌తో అనుసంధానం చేసి ముద్రించింది. ఓటింగ్‌లో పాల్గొనే ఓటర్లను ఎన్నికల అధికారులు స్లిప్పులతో పాటు ఎన్నికల సంఘం ప్రత్యేకంగా ఓటింగ్‌లో పాల్గొనడానికి సూచనలు చేస్తూ తయారు చేసిన ఓటర్ గైడ్, సీవిజిల్‌పై అవగాహన కరపత్రాలను పంపిణీ చేస్తున్నారు. ఓటరు నమోదుకు అర్హతలు, ఆన్‌లైన్ ప్రక్రియ, ఎన్నికల సంఘం ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు ప్రవేశపెట్టిన యాప్‌లు, పోస్టల్ బ్యాలెట్ పొందడానికి అర్హతలు, ఓటరు ప్రతిజ్ఞ, ఓటు వేసే విధానం, పోలింగ్ రోజు సెలవు దినం తదితర అంశాలను గైడ్లో తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో ఉన్నాయి. ఓటరు స్లిప్‌లో ఓటరు వివరాలు, వెనుక భాగంలో ఓటు వేయడానికి వెళ్లేటప్పుడు, వేసే సమయంలో పోలింగ్ కేంద్రంలో పాటించాల్సిన అంశాలు, పోలింగ్ బూత్ రూట్‌మ్యాప్‌లను పొందుపరిచారు.


మండలాల వారిగా ఓటర్లు, బీఎల్‌ఓల వివరాలు

మండలం	ఓటర్లు	బీఎల్‌ఓలు
తల్లాడ	45,747	57
కల్లూరు	53,475	63
పెనుబల్లి	43,174	50
సత్తుపల్లి	64,259	75
వేంసూరు	36,463	46
మొత్తం	2,43,118	291



అవగాహన కరపత్రాలు


ఓటర్ స్లిప్పులపై ఫొటో స్థానంలో క్యూఆర్‌కోడ్


వెనుక భాగంలో పోలింగ్ బూత్ రూట్ మ్యాప్

ఓటు హక్కు బాధ్యతగా



ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవడం పౌరుల బాధ్యత. ఇంటింటికీ బూత్ లెవెల్ అధికారులు ద్వారా ఓటర్ సభ్యులు ఓటర్ గైడ్లు కరపత్రాలను పంపిణీ చేపట్టాం. ఓటరు స్లిప్పుల్లో సాంకేతికతను జోడించి ఎన్నికల సంఘం ముద్రించిన సరికొత్త స్లిప్పులను అందజేస్తున్నాం. ఈ నెల 20వ తేదీలోగా ప్రక్రియ పూర్తి చేయాలని లక్ష్యాన్ని నిర్దేశించాం.

– అశోక్‌చక్రవర్తి,
ఎన్నికల రిటర్నింగ్ అధికారి, సత్తుపల్లి

ఓటర్లకు ఓటర్ స్లిప్పులు పంపిణీ

సత్తుపల్లి: సత్తుపల్లి నియోజకవర్గంలో ఓటర్ స్లిప్పులు పంపిణీ కార్యక్రమాన్ని గురువారం పట్టణంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి అశోక్‌చక్రవర్తి పరిశీలించారు. నియోజకవర్గంలోని 226 పోలింగ్ కేంద్రాల్లో ప్రతి ఇంటికి వెళ్లి ఎన్నికల సిబ్బంది పోలింగ్ స్లిప్పులను అందిస్తారని తెలిపారు. ఓటర్ల జాబితాలో పేర్లను పరిశీలించుకోవాలని విజ్ఞప్తి చేశారు. వృద్ధ ఓటర్లకు పోలింగ్ కేంద్రానికి అవసరం లేకుండా ఇప్పటికే పోస్టల్ బ్యాలెట్ అందించే ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

మూడు రోజుల్లో అందించాలి..

ముదిగొండ: ఓటర్ స్లిప్పులను బీఎల్‌ఓలు ఓటర్లకు మూడు రోజుల్లో అందించాలని తహసీల్దార్ రామారావు అన్నారు. గురువారం స్థానిక మండలపరిషత్ కార్యాలమంలో బీఎల్‌ఓలకు ఓటరు స్లిప్పులు పంపిణీ చేశారు. సీ విజిల్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అశోక్, సెక్టార్ ఆఫీసర్ అనురాధ, ఎంపీఓ సూర్యనారాయణ, డీటీ ఖాజా, బీఎల్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.


సత్తుపల్లి: ఓటర్లకు స్లిప్పుల పంపిణీని పరిశీలిస్తున్న ఆర్‌ఓ అశోక్‌చక్రవర్తి

అభివృద్ధిని చూసి ఆశీర్వదించండి


పెనుబల్లి: లంకాసాగర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న సండ్ర, నాయకులు


సత్తుపల్లి: కొండూరు సుధాకర్‌కి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

పెనుబల్లి/తల్లాడ: మండలాల్లో తాను చేసిన అభివృద్ధిని చూసి మరోమారు ఎమ్మెల్యేగా ఆశీర్వదిస్తే మరింత అభివృద్ధి చేసి చూపిస్తానని ఎమ్మెల్యే, సత్తుపల్లి బీఆర్‌ఎస్ అభ్యర్థి సండ్ర వెంకటవీరయ్య అన్నారు. గురువారం పెనుబల్లి మండలంలోని పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలు వస్తే మాయ మాటలు చెప్పుకుంటూ ఎంతో మంది వచ్చి పోతుంటారని, మీతో మీలో ఒకడిగా ఉండే తనను వచ్చే ఎన్నికల్లో కారు గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కాగా, ఆయా గ్రామాల్లో బీఆర్‌ఎస్ శ్రేణులు సండ్రకు ఘనంగా స్వాగతం పలికారు. అదే విధంగా సప్తపది ఫంక్షన్‌హాల్‌లో కొండూరి సుధాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే సండ్ర, ఎంపీ బండి పార్థసారధిరెడ్డి పాల్గొనగా.. మాదిగలంతా ఏకతా టిపై నడిచి సండ్రను గెలిపించుకోవాలన్నారు. తల్లాడ మండలంలోని పలు గ్రామాల్లో సండ్ర విజయాన్ని కాంక్షిస్తూ రాజ్యసభ సభ్యుడు బండి పార్థసారధిరెడ్డి ప్రచారం నిర్వహించి, సీఎం కేసీఆర్‌ను మూడోసారి గెలిపించాలన్నారు. కార్యక్రమాల్లో డీసీఎంఎస్ చైర్మన్ రాయల శేషగిరిరావు, డీసీసీబీ డైరెక్టర్ గొర్ల సంజీవ్‌రెడ్డి, జెడ్పీటీసీలు చెక్కిలాల మోహన్‌రావు, దిరిశాల ప్రమీల, ఎంపీపీలు దొడ్డా శ్రీనివాసరావు, లక్కినేని అలేఖ్య, వైరా ఏఎంసీ వైస్ చైర్మన్ డి.భద్రరాజులతో పాటు అధ్యక్షులు, నాయకులు కనగాల వెంకట్రావు, మందడపు అశోక్‌కుమార్, వెంకట్‌లాల్, రెడ్డెం వీరమోహన్‌రెడ్డి, ఎస్.కె.ఈసూబ్, శ్రీనివాసరెడ్డి, రాజశేఖర్ రెడ్డి, జీవీఆర్, దాసురావు, కోటారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ శ్రేణుల ఇంటింటి ప్రచారం..

కల్లూరు/కల్లూరురూరల్/వేంసూరు: సత్తుపల్లి బీఆర్‌ఎస్ అభ్యర్థి సండ్ర వెంకటవీరయ్య విజయాన్ని కాంక్షిస్తూ కల్లూరు, కల్లూరురూరల్, వేంసూరు మండలాల్లోని పలు గ్రామాల్లో సండ్ర తనయులు భార్గవ్, తేజలతో పాటు బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరుగుతూ బీఆర్‌ఎస్ మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలను వివరించి కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో సర్పంచ్ సింగిసాల పద్మ, ప్రసాద్, గ్రామ శాఖ అధ్యక్షుడు కె.నర్సింహరావు, ప్రవీణ్, లేహ్యం, మురళి, రైతు సమితి మండల కన్వీనర్ డాక్టర్ లక్కినేని రఘు, రామారావు, ప్రసాద్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

కొండూరు సుధాకర్‌ను ఆహ్వానిస్తున్నాం..

సత్తుపల్లి: మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరిన కొండూరు సుధాకర్‌ను సాదరంగా ఆహ్వానిస్తున్నామని ఎంపీ బండి పార్థసారధిరెడ్డి, బీఆర్‌ఎస్ అభ్యర్థి సండ్ర వెంకటవీరయ్య అన్నారు. సుధాకర్ నివాసంలో గురువారం తన అనుచరులతో సమావేశమయ్యారు. కార్యక్రమంలో గొర్ల సంజీవరెడ్డి, యంగళ సురేష్, మాగంటి శ్రీను, ప్రభాకర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

తెలంగాణ.. ప్రజల కోసమా, దొరల కోసమా?


మధిర: భట్టికి స్వాగతం పలుకుతున్న జాలిముడి గ్రామస్తులు


బోనకల్: మోటమర్రిలో ప్రచారం నిర్వహిస్తున్న మల్లు నందిని

మధిర: తెలంగాణ తెచ్చుకుంది.. ప్రజల కోసమా, దొరల కోసమా అని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క ప్రభుత్వాన్ని నిలదీశారు. గురువారం ఆయన మధిర మండలంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రామచంద్రాపురం, జాలిముడి, మల్లవరం, రొంపిమళ్ల, వంగవీడు తదితర గ్రామాల్లో ఆయన విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా జరిగిన సభల్లో ఆయన మాట్లాడుతూ.. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో ఇళ్లు ఇచ్చారా లేక భూమి పంచారా ? ఎందుకు ఓటేయాలని ప్రశ్నించారు. బడ్జెట్ తాకట్టు పెట్టి తెచ్చిన రూ.5 లక్షల కోట్ల అప్పుతో ప్రజలకు చేసేందేమి లేదని.. ప్రజల సంపదను ఎవరి జేబుల్లోకి వెళ్లిందో ఒక్కసారి మీరే ఆలోచించుకోవాలన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీ పథకాలు అమలు చేస్తామని, గ్యారంటీ కార్డుపై సంతకం పెట్టి ప్రజలకు హామీ ఇస్తున్నామన్నారు. బీఆర్‌ఎస్ పాలకులకు ఈ విధంగా ఇచ్చే ధైర్యం ఉందా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ నిర్మించిన సాగునీరు ప్రాజెక్టులతోనే రైతులకు సాగునీరు అందుతుందన్నారు. ఎన్నికల తర్వాత రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌కు భవిష్యత్ లేదన్నారు. ఆయా గ్రామాల్లో భట్టికి.. సీపీఐ, టీడీపీ శ్రేణులు మద్దతు తెలిపారు. జాలిమూడిలో సోనియాగాంధీ సన్నిహితురాలు డాక్టర్ యశోదర ప్రచారం చేశారు. ఈ గ్రామంలో భట్టి స్వయంగా ట్రాక్టర్ నడిపారు. ఆయనపై ప్రజలు పూల వర్షం కురిపించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలే శ్రీరామరక్ష..

బోనకల్/ఎర్రుపాలెం: ఆరు గ్యారంటీలే కాంగ్రెస్ పార్టీకి శ్రీరామరక్ష అని భట్టి సతీమణి మల్లు నందిని అన్నారు. బోనకల్ మండలంలోని మోటమర్రి, ఆళ్లపాడు గ్రామాలతో పాటు ఎర్రుపాలెం మండలంలోని సత్యనారయణపురం, గట్లగౌరారం, నారాయణపురం, వెంకటాపురం గ్రామాల్లో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్, సీపీఎం నుంచి 50 కుటుంబాలు కాంగ్రెస్‌లో చేరాయి. పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారికి పార్టీ అండగా ఉంటుందని, భట్టిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో భట్టి తనయుడు సూర్య విక్రమాదిత్య, జెడ్పీటీసీ మోదుగు సుధీర్ బాబు, మండలాధ్యక్షుడు దుర్గారావు, కోటి, పాపారావు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డి, పీసీసీ మెంబర్ ప్రతాపరెడ్డి, నర్సింహారావు, లక్ష్మణరావు, ప్రసాద్, వెంకటరెడ్డి, కృష్ణారెడ్డి, లక్ష్మీరెడ్డి, శ్రీనివాసరెడ్డి, తిరుపతమ్మ, శ్రీనివాసరెడ్డి, వెంకటకృష్ణారావు,హర్షవర్ధన్, సాయి, బాబురావు, రాజీవ్ గాంధీ, రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పాస్టర్ల సంఘం కమిటీ ఎన్నిక


పాస్టర్ల సంఘం నూతన కమిటీ సభ్యులు

వైరా: వైరా నియోజకవర్గ గ్లోరియస్ పాస్టర్లు, ఇవాంజిలిస్టుల నూతన కమిటీని గురువారం వైరాలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా ఎస్.యోహాన్, నూతన అధ్యక్షుడిగా జి.డేవిడ్, ఉపాధ్యక్షుడిగా యం.సత్యం, సెక్రటరీగా ఎం.జాషువా, జాయింట్ సెక్రటరీగా జి.జాన్, ట్రెజరర్‌గా టి.జాన్సన్ సలహాదారులుగా చినబాబు, ఆనంద్‌కుమార్, యోహాన్, ప్రభుదాస్, వైరా లోకల్ కన్వీనర్‌గా సిమోను, కరుణాకర్‌లను ఎన్నుకున్నారు.

కార్తీక పూజలు


శివాలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కొణిజర్ల: మండలంలోని పల్లిపాడులో గల స్వయంభూ శంభు లింగేశ్వరస్వామి దేవాలయంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని శివాలయ మహిళా భక్తులచే గురువారం స్వామికి ప్రత్యేక అన్నపూజ, అభిషేకం, 108 పూర్ణ కలశాభిషేకాలు, రుద్రహోమం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కృష్ణ, ప్రధాన పూజారి ముక్తేశ్వర శర్మ, మహిళా భక్తులు కంచేటి శేషారత్నం, లక్ష్మీ, కళావతి, లింగమ్మ తదితరులు పాల్గొన్నారు.

19న కంటి పరీక్షలు

కల్లూరు: కల్లూరు మండల రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 19వ తేదీన స్థానిక విజ్ఞాన్ విద్యాలయంలో వృద్ధులు, మహిళలు, రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు వేల్పుల కృష్ణయ్య, కడియాల ఫ్రాన్సిస్‌లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి నెల మూడో ఆదివారం కంటి పరీక్షలు ఉంటాయన్నారు. పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు ఉంటాయని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రభుత్వ కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించండి

కల్లూరురూరల్: రైతులు తమ ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని సెర్ప్ అడిషనల్ పీడీ రావుల జయశ్రీ కోరారు. గురువారం కల్లూరు మండలంలోని పుల్లయ్య బంజరు, బత్తులపల్లి, కొర్లగూడెం గ్రామాల్లో ఏర్పాటు చేసిన ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రేడ్ వన్‌రకం ధాన్యానికి రూ. 2,203లు, రెండో రకానికి రూ. 2,183లు ప్రభుత్వం అందిస్తుందన్నారు. ధాన్యం ఎగుమతి చేసే మిల్లుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం వెంకట రామారావు, సిబ్బంది వెంకటరామయ్య, ఫాతిమా, రామలక్ష్మి, కోటేశ్వరీ తదితరులు పాల్గొన్నారు.


ధాన్యం కొనుగోలు కేంద్రంలో పరిశీలిస్తున్న అడిషనల్ పీడీ రావుల జయశ్రీ

పంటలు ఎండిపోకుండా ఆదుకోవాలి


ఐబీ డీఈ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందిస్తున్న ఆయకట్టు పరిరక్షణ కమిటీ సభ్యులు

వైరా: వైరా రిజర్వాయర్ ఆయకట్టు పరిధిలో ఎండిపోతున్న పంటలకు నీరు విడుదల చేసి ఆదుకోవాలని ఆయకట్టు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఐబీ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించి డీఈ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, వైరా సొసైటీ మాజీ చైర్మన్ తాతా రంగారావులు మాట్లాడుతూ.. వైరా రిజర్వాయర్ కింద 20 వేల ఎకరాలలో వరి సాగు జరుగుతుందన్నారు. వరి సాగుకు ఒక్క తడి నీరు అందిస్తే సుమారు రూ.100 కోట్ల పంట రైతుల చేతికి వస్తుందన్నారు. రైతుల నీటి సమస్యల పరిష్కారానికై ఈ నెల 18న మహాధర్నా, రైతు దీక్ష చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు, వనమా చిన సత్యనారాయణ, సుధాకర్, రామారావు, కృష్ణారావు, హరినాధ్ బాబు, సాంబశివరావు పాల్గొన్నారు.

వరిలో విత్తనలోపాన్ని నిర్ధారించిన అధికారులు

వైరారూరల్: మండలంలోని విప్పలమడక గ్రామంలో కొంత మంది రైతులు సాగు చేసిన వరి పైరులో విత్తన లోపాన్ని మండల వ్యవసాయశాఖ అధికారులు నిర్ధారించారు. సత్తుపల్లిలోని ఓ డీలర్ వరుణ్ సీడ్స్ పేరుతో కల్తీవి రైతులకు విక్రయించడంతో రెండున్నర నెలలకే ఈని కంకులు తాలుగా మారడంతో బాధిత రైతులు వ్యవసాయ శాఖ అధికారులను ఆశ్రయించారు. దాంతో గురువారం వైరా మండల వ్యవసాయశాఖ అధికారి ఎస్.పవన్‌కుమార్ క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించారు. బాధిత రైతులు రుద్రాక్షల రవీందర్‌బాబు, నామాల నాగేశ్వరరావు, గరిడేపల్లి కృష్ణ, ముత్తమాల సామేలు, అక్కిశెట్టి చెంచయ్య, డబ్బూరి నాగేశ్వరరావు, కిలారు కోటేశ్వరరావులతో కలిసి ఏఓ పవన్‌కుమార్ కల్తీ విత్తనాలతో దెబ్బతిన్న వరి పంటలను పరిశీలించారు. దీంతో రైతులు తమకు నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యను జిల్లా ఉన్నతాధికారులు, కంపెనీ వారికి నివేదించి తగు చర్యలు తీసుకుంటామని ఏఓ పవన్‌కుమార్ హామీ ఇచ్చారు.


రైతులతో కలిసి వరి పైర్లను పరిశీలిస్తున్న ఏఓ పవన్‌కుమార్

వైద్య ఖర్చులకు దాతల సాయం

సాక్షి ఎఫెక్ట్..


అనారోగ్యంతో బాధపడుతున్న చిన్నారి

కల్లూరు: మండలంలోని ఎర్రబోయినపల్లి గ్రామంలో ఓ చిన్నారి హై షుగర్‌తో బాధపడుతున్న విషయాన్ని గురువారం సాక్షి దినపత్రికలో వార్త ప్రచురితం కాగా.. దాతలు స్పందించారు. గురువారం సాయంత్రం వరకు ఫోన్ పేలో చిన్నారి నదియ వైద్య ఖర్చుల కోసం రూ.100 నుంచి రూ.5 వేల వరకు పంపిస్తున్నారు. పాప ఆరోగ్యం బాగుకై దాతలు స్పందించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

అయ్యప్ప మాలాధారుల పాదయాత్ర

కారేపల్లి: మండలంలోని గంగారంతండా గ్రామానికి చెందిన అయ్యప్పస్వామి మాలధారులు పాదయాత్ర చేసుకుంటూ.. గురువారం ఇల్లందు పట్టణంలో ఉన్న హరిహరక్షేత్రానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామి నామస్మరణ చేసుకుంటూ..అయ్యప్ప శరణుఘోషలతో కాలినడకన 20కిలో మీటర్లు నడిచి హరిహరక్షేత్రము చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో మాలధారులు అనీల్, పవన్, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

ఒక్కసారి గెలిపించండి

ఎర్రుపాలెం: రాష్ట్రంలో మళ్లీ వచ్చేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని, మధిర ఎమ్మెల్యేగా ఒక్కసారి గెలిపించి ఆశీర్వదించాలని జెడ్పీ చైర్మన్, మధిర బీఆర్‌ఎస్ అభ్యర్థి లింగాల కమల్‌రాజ్ ఓటర్లను అభ్యర్థించారు. గురువారం మండలంలోని పలు గ్రామాల్లో విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావుతో కలిసి విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మధిర ఏఎంసీ మాజీ చైర్మన్ రామకృష్ణ, బీఆర్‌ఎస్ మండల కమిటీ అధ్యక్షుడు సాంబశివరావు, ఎంపీపీ శిరీష, జెడ్పీటీసీ కవిత, ఎంపీటీసీ కృష్ణారావు, అన్నపూర్ణమ్మ, సర్పంచ్‌లు జయలక్ష్మి, శ్రీనివాసరావు, అప్పారావు, రాధమ్మ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపంథా..

సత్తుపల్లిరూరల్: దోపిడీ లేని రాజ్యస్థాపనకై పాటుపడే సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా అభ్యర్థి బీరెల్లి లాజరును గెలిపించాలని, కత్తెర గుర్తుపై ఓటు వేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు కోరారు. గురువారం సత్తుపల్లిలో ఆ పార్టీ అభ్యర్థి ప్రచార రథాన్ని గోకినేపల్లి ప్రారంభించారు. వ్యవసాయ కూలీలు, రైతులు, కార్మికులు, విద్యార్థుల హక్కుల కోసం నిరంతరం పార్టీ పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు ఎ.వెంకటరెడ్డి, శ్రీనివాసరావు, లలిత, డివిజన్ నాయకులు శరత్, కె.పుల్లారావు, నాగిరెడ్డి, పోతురాజు, వెంకటనర్సమ్మ, మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్..

కారేపల్లి: కారు గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వైరా బీఆర్‌ఎస్ అభ్యర్థి మదన్‌లాల్ అన్నారు. గురువారం కారేపల్లి మండలంలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. మాధారం, మంగళితండా, భాగ్యనగర్ తండా, రేలకాయలపల్లి గ్రామ పంచాయతీలల్లో ప్రచారం నిర్వహిస్తూ.. మూడోసారి కేసీఆర్‌ను ముఖ్యమంత్రిని చేసి తెలంగాణ అభివృద్ధికి బాటలు వేసుకుందామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మాలోత్ శకుంతల, జెడ్పీటీసీ సభ్యుడు జగన్‌నాయక్, మండల అధ్యక్షుడు ఉమాశంకర్, వైఎస్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బస్వాపురంలో మహాపడిపూజ


బస్వాపురంలో అయ్యప్ప స్వామికి అభిషేకం చేసి అలంకరించిన దృశ్యం

తల్లాడ: మండలంలోని బస్వాపురం గ్రామంలో గురువారం రాత్రి మహా పడిపూజ మహోత్సవం ఘనంగా జరిగింది. గ్రామానికి చెందిన కొండపల్లి రమేష్ – సునీత దంపతులచే సగుర్తి కరుణాకర్ గురుస్వామి, సత్తెనపల్లి గిరిగురుస్వామి ఆధ్వర్యంలో మహా పడిపూజ కన్నుల పండుగగా జరిగింది. ఈ సందర్భగా అయ్యప్ప స్వామికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. స్వామియే శరణం అయ్యప్ప శరణు ఘోషతో కోదాడ గజ్జెల శ్రీను గురుస్వామి గానామృతంతో నృత్యాలతో అయ్యప్ప స్వాములు ఆడి పాడారు. ఈ కార్యక్రమంలో కన్య స్వాములు, భవానీలు, గోవింద స్వాములు, ఆంజనేయ మాలధారులు, భక్తులు పాల్గొన్నారు.

హోరెత్తిన ప్రచారాలు..

కల్లూరురూరల్: వచ్చే ఎన్నికల్లో హస్తం గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. గురువారం కల్లూరు మండలంలోని పలు గ్రామాల్లో ప్రచారం నిర్వహించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. ఆమె వెంట నాయకులు పసుమర్తి చందర్‌రావు, రంగారెడ్డి, కృష్ణారెడ్డి, ఏసురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాడే పార్టీకి ఓటేయాలి..

బోనకల్/ఎర్రుపాలెం/చింతకాని/ఏన్కూరు: ప్రజా సమస్యలపై నిత్యం పోరాటం చేసే సీపీఎం పార్టీకే ఓటు వేయాలని సీపీఎం మధిర అభ్యర్థి పాలడుగు భాస్కర్ ఓటర్లను అభ్యర్థించారు. గురువారం బోనకల్, ఎర్రుపాలెం మండలంలోని పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. చింతకానిలో సీపీఎం మండల కార్యదర్శి మడుపల్లి గోపాలరావు భాస్కర్‌ను గెలిపించాలని కోరారు. అదే విధంగా వైరా సీపీఎం అభ్యర్థి భూక్య వీరభద్రంను గెలిపించాలని కోరుతూ.. ఏన్కూరు మండలంలోని రాయమాదారంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న బీఆర్‌ఎస్, బీజేపీ లకు రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలన్నారు. ఈ కార్యక్రమాల్లో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పొన్నం వెంకటేశ్వరావు, ఎర్రుపాలెం మండల కార్యదర్శి దివ్వెల వీరయ్య, జిల్లా కమిటీ సభ్యుడు చింతలచెర్వు కోటేశ్వరావు, బోనకల్ మండల కన్వీనర్ దొండపాటి నాగేశ్వరావు, సీపీఎం నాయకులు వత్సవాయి జానికిరాములు, దేశబోయిన ఉపేందర్, పులి యజ్ఞనారాయణ, గోపయ్య, గడ్డం కోటేశ్వరరావు, కిరణ్‌బాబు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

మమ్ముల్ని గెలిపించండి

పెనుబల్లి/కారేపల్లి: సత్తుపల్లి బీజేపీ అభ్యర్థి నంబూరి రామలింగేశ్వరరావు విజయాన్ని కాంక్షిస్తూ పెనుబల్లి మండలం వీఎంబంజర్, వైరా జనసేన అభ్యర్థి సంపత్‌నాయక్‌ను గెలిపించాలని కారేపల్లిలో బీజేపీ, జనసేన పార్టీ శ్రేణులు విస్తృత ప్రచారం చేశారు. బీజేపీ మేనిఫెస్టోను ఓటర్లకు వివరిస్తూ ఓటర్లను అభ్యర్థించారు.

ఈ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, నాయకులు బొర్రా నరసింహారావు, పడిగల మధుసూదన్‌రావు, ఓరుగంటి రాము, కల్తి రాంప్రసాద్, సుజాత, ధనసరి శ్రీనివాస్, సీపీఎం నాయకులు బాలాజీ, నాగేశ్వరరావు, రాములు, లెనిన్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే సుస్థిర పాలన..

తల్లాడ: బీజేపీతోనే సుస్థిర, సమర్థవంతమైన పాలన అందుతుందని బీజేపీ సత్తుపల్లి అసెంబ్లీ అభ్యర్థి నంబూరి రామలింగేశ్వరరావు అన్నారు. గురువారం మండలంలోని అన్నారుగూడెం గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ ఓట్లను అభ్యర్థించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఆపతి వెంకటరామారావు, నాయకులు తేజావత్ బాలాజీ నాయక్, గాదె కృష్ణారావు, ఎల్లంకి సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.